క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈవో సంపత్‌రావు

కమాన్‌పూర్: కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని ప్రభుత్వ ఆమోదిత ప్రయివేటు పాఠశాలల యాజమన్యాలు ప్రభుత్వ నిబంధలు పాటించాలని ఎంఈవో పల్లెపాటి సంపత్‌రావు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో కమాన్‌పూర్, రామగిరి మండలాల పరిధిలోని ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్స్‌తో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవేటు పాఠశాలలు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను వినియోగించాలని, ప్రభుత్వ సెలవులను అనుసరించాలని సూచించారు. ప్రతి పాఠశాలలో గవర్నింగ్ బాడీ నిర్ణయించిన నిబంధనల ప్రకారం ఫీజులు వసూలు చేయాలని, వివరాలను తప్పనిసరిగా నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు. పాఠశాలల యాజమన్యాలు పాఠ్యపుస్తకాలు విక్రయించొద్దన్నారు. విద్యార్థుల వద్ద టీసీ పేరుతో అధిక డబ్బులు వసూలు చేసినా, నిబంధనలు ఉల్లంఘించినా విద్యాశాఖ పరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆర్టీవో అనుమతితో కండిషన్‌లో ఉన్న బస్సులు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. సమావేశంలో ప్రయివేటు పాఠశాలల అధ్యక్షులు అబ్బు కేశవరెడ్డి, లక్ష్మన్‌కుమార్, తిరుపతిరెడ్డి, వినయ్‌కుమార్, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, పద్మనాభం, బి.శ్రీనివాసరాజు, కుమార్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ బాలాజీరావు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తానని ఎంపీపీ బాలాజీరావు అన్నారు. సుల్తానాబాద్ మండలం కొదురుపాక గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.3లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను శనివారం ఎంపీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాగర్ రావు, కార్యదర్శి, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

కమాన్‌పూర్: రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన జంగిలి ఓదెలు–కుమారి దంపతుల కూతురు శ్వేత ఇటీవల ప్రకటించిన ఎంసెట్ ఫలితాల్లో 12,921 ర్యాంకు సాధించినందుకు శనివారం సర్పంచ్ గంట పద్మ సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, నిమ్మనపల్లి, పెద్దకల్వల, పెద్దబొంకూర్‌తో పాటు పెద్దపల్లి, రంగంపల్లి, చందపల్లిలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సుల్తానాబాద్‌రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజేందర్ అన్నారు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి, కదంబాపూర్ గ్రామాల్లో శుక్రవారం రాత్రి సైబర్ క్రైం, ట్రాఫిక్ రూల్స్, పోక్సో, షీటీం, డ్రగ్స్‌పై ఎస్సై అవగాహన కల్పించారు. అలాగే మహిళలు అత్యవసర వేళల్లో డయల్ 100కు, షీటీం క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆసుపత్రి కాంట్రాక్టు వర్కర్ల సమ్మెకు మద్దతు



సమ్మెలో పాల్గొన్న నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రిలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలంటూ నిర్వహిస్తున్న సమ్మెకు పలు సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఆరు నెలలుగా వేతనాలందక ఇబ్బందులు పడుతున్నామంటూ వర్కర్లు సమ్మెకు దిగారు. కాంట్రాక్టు వర్కర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బుద్దుల రమేశ్, ప్రజాసంఘాల జేఏసీ నాయకుడు బొంకూరి సురేందర్ సన్నీ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో నిలువ నీడ కరువు

- షెడ్లు, నీటి సౌకర్యం కల్పించని వైనం
- జీఎంకు వినతిపత్రం ఇచ్చినా ఫలితం శూన్యం
- భారీ ఆదాయం వచ్చినా పట్టించుకోని ఉన్నతాధికారులు



షెడ్లు లేని కొలనూర్ రైల్వేస్టేషన్

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో ఉన్న రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు నీడ కరువైంది. ఆయా రైల్వేస్టేషన్ల ద్వారా వచ్చే ఆదాయం బాగానే ఉన్నప్పటికీ సౌకర్యాల ఏర్పాటులో గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడాదికి రెండుసార్లు పర్యటనకు వచ్చే సికింద్రాబాద్ ముఖ్య అధికారి జీఎంకు రైల్వేస్టేషన్‌లో షెడ్లు నిర్మించాలని వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలోని ఓదెల, కొలనూర్, పొత్కపల్లి, బిజిగిరిషరీఫ్, కొత్తపల్లి రైల్వేస్టేషన్ల నుంచి నిత్యం వేలసంఖ్యలో ప్రయాణికులు సికింద్రాబాద్, కొత్తగూడెం నుంచి సిర్పూర్‌కాగజ్‌నగర్, కరీంనగర్, తిరుపతి, బల్లార్షా వరకు ప్రయాణిస్తుంటారు. ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది కానీ సౌకర్యాల కల్పన మాత్రం శూన్యం. 20ఏళ్ల క్రితం వేసిన షెడ్లే ఇప్పటికీ దర్శనం ఇస్తున్నాయి తప్ప కొత్తగా షెడ్లు ఏర్పాటు చేసింది లేదని ప్రయాణికులు వాపోతున్నారు. మండే ఎండల్లో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రామగిరి, సింగరేణి, భాగ్యనగర్, ఇంటర్‌సిటీ, అజ్నీ ప్యాసింజర్ రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడవటంతో నిలువ నీడ సౌకర్యం లేక ప్లాట్‌ఫామ్‌ల పైనే ప్రయాణికులు నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది.

చెట్లను తొలగించారు..

షెడ్లు లేకపోవటంతో వర్షాకాలంలో తిప్పలు పడాల్సిందే. ఎండాకాలంలో అయితే ఎండల తీవ్రతతో ప్రయాణికులు వడదెబ్బకు గురవుతున్నారు. మూడో రైల్వేలైను ఆధునీకరణ పనుల్లో భాగంగా రైల్వేస్టేషన్‌లోని పచ్చని చెట్లను రైల్వేశాఖ తొలగించటంతో ప్రయాణికులకు ఆమాత్రం కూడా నీడ సౌకర్యం కోల్పోయారు. సికింద్రాబాద్ ముఖ్య అధికారి జీఎంకు ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. రైల్వేస్టేషన్లలో వెంటనే షెడ్లతో పాటు కనీస సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రయాణికులు ఉన్నతాధికార్లను కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



ఒకవైపు గంటల తరబడి రైళ్ల ఆలస్యం, మరోవైపు ఎలాంటి సౌకర్యాలు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రయాణికులకు నీడ, మంచినీటి వసతులు కల్పించాలి. ప్రయాణికుల రద్దీకి అనుకూలంగా అధికారులు సౌకర్యాలు కల్పించాలి. – గుదూరి కిషన్‌రావు, పెద్దపల్లి

షెడ్లు నిర్మించాలి



ఓదెల రైల్వేస్టేషన్లో ప్రయాణికులకు సరిపడా షెడ్లు నిర్మించాలి. ప్లాట్‌ఫామ్స్ పెంచుతున్నారు, కానీ షెడ్లను నిర్మించడం మరిచిపోయారు. వేలసంఖ్యలో ప్రయాణికుల ద్వారా రైల్వేశాఖకు భారీ ఆదాయం వస్తోంది. ప్రయాణికులకు సరిపడా సౌకర్యాలను మెరుగుపరచాలి.
– పిట్టల శ్రీనివాస్, ఓదెల

వినతిపత్రాలు ఇచ్చినం



కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలోని రైల్వేస్టేషన్లో షెడ్ల నిర్మాణం కోసం జీఎంకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. ప్రస్తుతం మండుతున్న ఎండలకు ప్రయాణికులు వడదెబ్బకు గరవుతున్నారు. అధికారులు పట్టించుకోవాలి. – కాశవేని చేరాలు, కొలనూర్

బామ్లానాయక్ తండాలో గిరిజన ఉత్సవాలు



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

పాలకుర్తి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని బామ్లానాయక్‌తండాలో గిరిజన ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ తెలిపే ఫ్లెక్సీతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహిళలు నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో లలిత మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి నగదు పురస్కారం అందజేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీవో షబ్బీర్‌పాషా, సర్పంచ్ రాజునాయక్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, ఉపసర్పంచ్ తిరుపతి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు



నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

జ్యోతినగర్: ప్రభుత్వ సీలింగ్ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సునీల్‌రావు, తహసీల్దార్ జాహేద్ పాషా అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడిపల్లి శివారులో గల పీకే రామయ్య కాలనీలోని సర్వే నం.617లో శుక్రవారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా గుడిసెలు నిర్మించారని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న సీలింగ్ భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా, ఆక్రమించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువ స్థలాల ఆక్రమణ



ఆక్రమణకు గురైన ఎస్సారెస్పీ కాలువ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న ఎస్సారెస్పీ భూములను కొంతమంది రైతులు కబ్జా చేస్తున్నారు. ఇరువైపులా కాలువ పక్క వరకు సాగుకు సిద్ధం చేస్తున్నారని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఎస్సారెస్పీ కాలువను చివరి వరకు పర్యవేక్షించేందుకు అధికారుల వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలుగా రహదారి ఉన్నప్పటికీ హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి. ప్రస్తుతం ఎస్సారెస్పీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఇరువైపులా కాలువ పక్క వరకు రైతులు సాగు చేస్తుండడంపై చివరి భూములు ఉన్న రైతులు వెళ్లేందుకు దారిలేకుండా పోతోందని పలువురు అన్నదాతలు వాపోతున్నారు. కాలువ భూములు కబ్జాకు గురవుతున్నాయంటూ, చివరి భూములకు వెళ్లేందుకు రహదారి లేకుండా పోతోందని ఇప్పటికే పలుమార్లు మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు సభా దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సీజన్‌కు ముందే ఎస్సారెస్పీ అధికారులు స్పందించి తమ స్థలాలకు హద్దులు ఏర్పాటు చేస్తే చివరి భూముల రైతులకు సౌకర్యంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.

సమాచారం

✦ వసతి గృహంలో అడ్మిషన్లు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లోని ఎస్సీ బాలుర సాంఘిక సంక్షేమ వసతిగృహంలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు వార్డెన్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు హాస్టల్‌లో అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. మల్యాల మోడల్ స్కూల్, కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్, పీఎస్ పాఠశాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని అర్హులు వినియోగించుకోవాలని కోరారు.

✦ బీసీ రుణాల్లో వాల్మీకి బోయలకు అవకాశం ఇవ్వాలి

ఎలిగేడు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కులవృత్తులకు బీసీ రుణాలలో వాల్మీకి బోయలకు అవకాశం కల్పించాలని శనివారం వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బీసీ డెవలప్‌మెంట్ అధికారి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు ముతికెల మల్లేశం, కుడుదుల నరేశ్, భోగి సతీశ్, బుకాల సారయ్య, బలంతుల ఎల్లయ్య, భూమయ్య, గుజ్జుల శ్రీను, కెంగెర్ల మహేందర్, శంకర్, రంగయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

✦ ఆర్‌అండ్‌బీ సబ్ డివిజన్ ఆఫీస్ ఏర్పాటు

జూలపల్లి: మండల కేంద్రానికి రోడ్లు, భవనాలశాఖ సబ్ డివిజన్ కార్యాయలం మంజూరైంది. గతంలోనే సబ్ డివిజన్ కార్యాలయం మంజూరు ఏర్పాటుకు ప్రకటన వచ్చినా.. భవనం లేక ఆగిపోయింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ఈజీఎస్ భవనంలో ఏర్పాటు చేస్తూ ఆర్‌అండ్‌బీ అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. కాగా భవనం బిల్లు రాకపోవడంతో కాంట్రాక్టర్ భవనంపై అంతస్తుకు సంబంధించిన తాళాలు ఇవ్వలేదని సమాచారం. దీంతో ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఏర్పాటు బోర్డుకే పరిమితమైంది.

✦ 21న జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు 21న బుధవారం ప్రభుత్వ ఐటీఐ ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి తిరుపతిరావు తెలిపారు. ఉదయం 11గంటలకు మొదలయ్యే ఈ జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్ నెంబరు 89853 36947, 95026 42441లో సంప్రదించాలన్నారు.

సర్వర్‌డౌన్ సమస్యను పరిష్కరించండి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామగుండం: ఆన్‌లైన్‌లో కలుగుతున్న సర్వర్‌డౌన్ సమస్యను పరిష్కరించి లబ్ధిదారులకు సకాలంలో ధ్రువీకరణపత్రాలు అందేలా చూడాలని మున్సిపల్ కార్పొరేటర్ల ఫోరం సభ్యులు తహసీల్దార్ జాహేద్ పాషాకు శనివారం వినతిపత్రం అందించారు. సర్వర్‌డౌన్‌తో కులవృత్తిదారులు రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని, కులం, ఆదాయం, నివాసధ్రువీకరణల కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం విద్యార్థులూ పడిగాపులు పడుతున్నారని పేర్కొన్నారు. ఫోరం అధ్యక్షుడు కన్నూరి సతీశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ధాతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మేకల సదానందం, కార్యదర్శులు, నాయకులు ఐత శివకుమార్, తిరుపతి, గణేశ్ పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు అమలు చేయాలి


కమాన్‌పూర్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండే కార్మికులకు ప్రభుత్వం పెంచిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.2వేలు పెంచుతూ జీవో జారీ చేశారని గుర్తు చేశారు. కానీ ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెంచిన వేతనాలు అమలు చేయాలని, లేకుంటే జూలై ఒకటో తేది నుంచి పాఠశాలలో వంటలు చేయడం నిలిపివేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో పద్మ, రమాదేవి, సరోజన, మమత, లక్ష్మి, కళావతి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం

- రెండుగంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

ఓదెల: కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లె సబ్‌స్టేషన్ వద్ద 11కేవీకి సంబంధించిన విద్యుత్ శనివారం స్తంభం విరగడడంతో కొలనూర్, పెగడపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. మండే ఎండల ఉక్కపోతతో గ్రామస్తులు ఇబ్బంది పడ్డారు.

సాఫ్ట్‌వేర్ కోర్సులపై అవగాహన



శిక్షణ ఇస్తున్న నిపుణులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని మార్కండేయకాలనీలోని పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ వారి సహకారంతో నిపుణుతో విద్యార్థులకు శనివారం కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులపై ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సులు సీ, సీ ప్లస్ ప్లస్, జావా, పైథాన్, డేటా స్ట్రక్చర్స్, ఫ్రంట్ అండ్ బ్యాక్ ఎండ్ కోర్సులపై విశ్లేషణతో కూడిన అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ అడప వనిత–శ్రీనివాస్ పటేల్, శిక్షణ నిపుణురాలు లావణ్య, శ్రీనివాస్ పెంద్యాల పాల్గొన్నారు.

రైతులను గోస పెడుతున్నారు



మద్దతు ప్రకటిస్తున్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

పెద్దపల్లిరూరల్: పంట సాగు చేసిన రైతులను సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం గోస పెడుతోందని ప్రజాహిత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సి.సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. పెద్దపల్లిలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం రైతు సమస్యల పరిష్కారం కోసం, ధాన్యం కొనుగోలు చేసిన సొమ్మును వెంటనే చెల్లించాలనే డిమాండ్‌తో 12 గంటల దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు మాజీ ఎంపీ చెలిమెల సుగుణకుమారి, మాజీ ఎమ్మెల్యేలు గోనె ప్రకాశ్‌రావు, బిరుదు రాజమల్లు, గుజ్జుల రామకృష్ణారెడ్డి సంఘీభావం ప్రకటించారు. వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, మాజీ ఎంపీపీ వేముల రామ్మూర్తి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చిలారపు పర్వతాలు, నాయకులు ఠాకూర్ రాంసింగ్, ప్రజాసంఘాల నాయకులు గాండ్ల మల్లేశం, బొంకూరి సురేందర్ సన్నీ, పిన్నింటి రాజు, శ్రీనివాసరావు, సదానందం, ఫహీం, కోదాటి వెంకటేశ్వర్‌రావు, విజయ్, ఓదెలు, సందీప్, సతీశ్, కొండాల్ పాల్గొన్నారు.

తొగర్రాయిలో గడపగడపకూ కాంగ్రెస్



మాట్లాడుతున్న విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు అన్నారు. మండలంలోని తొగర్రాయిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మాజీ ఎమ్మెల్యే ఇంటింటా తిరిగి పార్టీ పథకాలు, హామీలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం వస్తే నీళ్లు, నిధులు, నియామకాలు వస్తాయని అనుకుంటే నిరాశే మిగిలిందన్నారు.

రేపు ఇళ్లస్థలాల కోసం ధర్నా



మాట్లాడుతున్న ముత్యంరావు

పెద్దపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇళ్లు లేని పేదలకు ఇల్లు కట్టిస్తామని మోసపూరిత వాగ్దానాలు చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆరోపించారు. పెద్దపల్లిలోని కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఇప్పటికే గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారందరికీ పట్టాలు ఇవ్వాలంటూ 19న ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆఫీసుల ఎదుట నిర్వహించనున్న ధర్నా విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకుంటున్నా పాలకులు అడ్డు చెప్పడం లేదని ఆరోపించారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు అశోక్, ప్రశాంత్, రవీందర్, దిలీప్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజల సమస్యలు పరిష్కారం

జ్యోతినగర్: ప్రజల సమస్యలు కాంగ్రెస్‌తోనే పరిష్కారం అవుతాయని, అధికారంలోకి వచ్చేందుకు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పార్టీ కార్యదర్శి ఎండీ.రహీం కోరారు. ఏఐసీసీ సభ్యుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు హర్కర వేణుగోపాల్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కాంగ్రెస్ నాయకులు రుద్రభట్ల సత్యనారాయణ, బొద్దున రాజేశం, సతీశ్, ఎండీ.అబ్దుల్లా, చిలుక రామ్మూర్తి, మామిడాల సురేశ్, గోసిక రవి, సలీం, శ్రావణ్ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రగతినగర్ ప్రాంతంలో శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని వాహనదారుల నుంచి జరిమానా వసూలు చేశారు. పెండింగ్‌లో ఉన్న చాలన్లు చెల్లించాలని సూచించారు.

పేదల గుడిసెలు తీసేయడం సరికాదు

జ్యోతినగర్: ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం మూడు నెలలుగా భూ పోరాటాలు చేస్తున్న పేదల గుడారాలు తొలగించడం సరికాదని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ పీకే రామయ్యకాలనీలోని పేదల గుడిసెలు తొలగింపు స్థలంలో శనివారం ఆయన మాట్లాడారు. పేదలకు స్థలాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉన్నటువంటి పేదల ఇళ్లు కూడా తొలగిస్తారా అని ప్రశ్నించారు. ఇళ్లస్థలాలు పేదలకు కేటాయించాలని వినతి పత్రాలు ఇచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఎం.రామాచారి, నాయకులు ఎస్ బిక్షపతి, గీట్ల లక్ష్మారెడ్డి, నాగమణి పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యమెందుకు?

పెద్దపల్లిరూరల్: బీసీల్లో పలు కులాలకు చెందిన వారికి రూ.లక్ష సాయం అందిస్తామంటూ సీఎం కేసీఆర్ ప్రకటించడంతో దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు నానా పాట్లు పడుతున్నారని, ధ్రువపత్రాల జారీలో జాప్యం ఎందుకు చేస్తున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజం మహంత, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లి తహసీల్దార్ ఆఫీసు ఎదుట శనివారం పార్టీ నాయకులతో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పథకం ద్వారా లబ్ధి పొందాలనే ఆశతో కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్లు జారీ చేయడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే సర్టిఫికెట్లు జారీ చేయాలని, దరఖాస్తు చేసుకునే గడువు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు సంపత్‌రావు, దిలీప్‌కుమార్, శ్రీకాంత్, ఫయాజ్, సతీష్, రాకేశ్, తూముల రవితేజ, రాజం శ్రీనివాస్ ఉన్నారు.

చిత్ర కథ



ప్రమాదకరంగా గుంత

జ్యోతినగర్: భారీ వాహనాల రాకపోకలతో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడింది. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డులో ఇటీవల భారీ వాహనాల రాకపోకలతో పాత బ్రిడ్జిపై గుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో రోడ్డు ద్వారా ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులతో పాటు మల్కాపూర్, రామయ్యపల్లె ప్రాంతాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో స్కూల్ బస్సులు, ఆటోలు కూడా ఈ దారి గుండా వెళ్తాయి. బ్రిడ్జి కూలి పదిరోజులు దాటినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాగా శుక్రవారం రాత్రి ఒకరు బైక్‌పై వస్తూ అదుపు తప్పి గుంతలో పడి గాయపడ్డారు. సంబంధిత విభాగం వారు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.